అందని వేతనాలు.. తప్పని కష్టాలు

- ఉపాధి కూలీలకు 9 వారాలుగా పెండింగ్
- రేపు, మాపు అంటున్న అధికారులు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు



చెరువు పూడికతీత పనిలో ఉపాధి కూలీలు



ఆయిల్‌పామ్ చెట్లకు రింగ్ ట్రెంచ్‌లు ఏర్పాటు చేస్తున్న ఉపాధి కూలీలు

నల్లజర్ల: గ్రామాల్లో ప్రజల వలసను కట్టడి చేయడమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. రోజు వారీ మస్టర్లు వేస్తూ బిల్లులు జనరేట్ చేస్తున్నా, కూలి మాత్రం అందడం లేదు. దీంతో వారి కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారింది. పనులు చేస్తున్నా వేతనాలు చెల్లించడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. దీంతో నెలల తరబడి వేతనాలు చెల్లించకపోతే ఎలా అని కూలీలు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పనుల కల్పనలో తాత్సారం

కొన్ని గ్రామాల్లో ఉపాధి పనుల కల్పనలో తాత్సారం చేస్తున్నారు. అచ్చన్నపాలెం వంటి గ్రామాలో అసలు ఎక్కడ ఏం పనులు జరుగుతున్నాయనే విషయం స్థానిక సర్పంచ్‌కు కానీ, ఎంపీటీసీ సభ్యునికి కానీ తెలియడం లేదని చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో అంతంతమాత్రంగా పనులు జరుగుతున్నాయి. వీటిలో పాల్గొన్న వేతనదారులకు వేతనాలు అందని దుస్థితి. జనవరి 14 నుంచి మార్చి 27 వరకు పనులు చేసిన వారికి వేతనాలు అందకపోవడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు.

1,600 మంది మాత్రమే..

నల్లజర్ల మండలంలో 16 వేల జాబ్‌కార్డులు ఉండగా, 10,877 కార్డుల వారు పనులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులకు కేవలం 1,600 మంది మాత్రమే హాజరవుతున్నారు. ఇందుకు కూలీలకు దాదాపు రూ.2 కోట్ల వేతన బకాయిలు ఉన్నట్టు చెబుతున్నారు. చెరువు పూడికతీతలు, ఆయిల్‌పామ్ తోటలలో రింగ్ ట్రెంచ్‌లు, ఫీడర్ చానల్స్, ఫారం పాండ్స్ వంటి పనులు చేశారు. ఒక్కొక్కరికి దాదాపు రూ.20 వేల వరకు వేతన బకాయలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇంట్లో ఇద్దరు పనులకు వెళ్తే దాదాపు రూ.40 వేలు పైబడి కూలీ చెల్లించాల్సి ఉంది. పని చేసిన 15 రోజుల్లోగా వేతనాలు అందించాల్సి ఉంది. వేతనదారులు పాస్ బుక్‌లు పట్టుకుని బ్యాంకులు, పోస్టాఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.

పొంతన లేని సమాధానాలు

వేతనాలపై సంబంధిత అధికారులు మాత్రం పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు వేతనాలు అందకపోవడం, మరోవైపు వెళదామన్నా ప్రస్తుతం రైతు వారీ పనులు లేకుండా పోయాయి. వేతనాలు వచ్చాక ఇస్తామని వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి రుణాలు తీసుకువచ్చి కుటుంబాలను పోషించాల్సి వస్తోందని కూలీలు వివరిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో అధికారులు తగిన చర్యలు చేపట్టి, బకాయిలు వెంటనే ఖాతాలకు జమ చేయించాలని వేతనదారులు కోరుతున్నారు.

ఏడు వారాలుగా అందాలి



జనవరి నెల రెండో వారం నుంచి వేతనాలు అందాల్సి ఉంది. మధ్యలో రెండు వారాలు పనికి వెళ్లలేదు. ఏడు వారాల కూలీ డబ్బు అందాల్సి ఉంది. అధికారులను అడిగితే ఇంకా డబ్బు జమ కాలేదని చెబుతున్నారు. రోజురోజుకూ బకాయిలు పెరుగుతున్నాయి. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ఇటువంటి పరిస్థితి గతంలో ఎప్పుడు జరగలేదు.

– కూనపాం చినమంగ, వేతనదారు, సుభద్రపాలెం

నెలాఖరుకు చెల్లిస్తాం



ఉపాధి వేతనాలకు సంబంధించి నిధులు విడుదల కావాల్సి ఉంది. సుమారు ఆరు నుంచి ఏడు వారాలు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు వచ్చిన వెంటనే జమ చేస్తాం. ఈ నెలాఖరు నాటికి వస్తాయని భావిస్తున్నాం. వేతనదారులు ఆందోళన చెందవద్దు. పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లిస్తాం.

– కె.వెంకట్రావు, ఏపీఓ, నల్లజర్ల

క్లుప్తంగా

31లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి

తాళ్లపూడి: మండలంలో సొంత భూములు కలిగిన రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి రుచిత శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రుచిత మాట్లాడుతూ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్టర్ పోర్టల్‌లో రైతులు తమ ఆధార్‌కార్డు, పొలం పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని వెళ్లి ఈ నెల 31లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండలంలో 6,163 మంది పీఎం కిసాన్ పోర్టల్‌లో నమోదు కాగా ఇప్పటి వరకు 4,625 మంది ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తయినట్టు తెలిపారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



తాళ్లపూడి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో సంధ్య

తాళ్లపూడి: వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జె సంధ్య పేర్కొన్నారు. తాళ్లపూడి మండలంలోని పీహెచ్‌సీని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో మాట్లాడుతూ వృద్ధులు, చిన్న పిల్లలు, బాలింతలు, ఎండ సమయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావద్దని సూచించారు. గ్రామ సచివాలయాల్లో, స్థానిక పీహెచ్‌సీల్లో వైద్య సలహాలు తీసుకోవాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యాక్రమంలో డాక్టర్ హారిక గుప్తా తదితరులున్నారు.

నాగారమ్మ ఆలయంలో గీతా పారాయణ



బ్రాహ్మణగూడెంలో గీతా పారాయణలో పాల్గొన్న మహిళలు

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో గ్రామదేవత నాగారమ్మ ఆలయంలో శుక్రవారం గీతా పారాయణ నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రత్తిపాటి కృష్ణమూర్తి, గారపాటి బాలరామూర్తి ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భగవద్గీత శ్లోకాల పారాయణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్తిపాటి కృష్ణమూర్తి, గారపాటి బాలరామ్మూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగారమ్మ ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా గూడూరి పుట్టిన రోజు వేడుక



గూడూరి శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలను కొవ్వూరు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని వాత్సల్య వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ చేతుల మీదుగా ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, నాయకులు చొప్పా అప్పలనాయుడు, మద్దిపట్ల దొర బాబు, మాసా ఆనంద్, పాకా మోహన్‌రావు, వేము వెంకటరత్నం పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

నిడదవోలు : స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని జనరల్ మసీదులో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మెడవరపు భద్రం దొర, ముతవల్లి నోవిషద్, అంజద్, చిన్నం మురళీకృష్ణ, మహమ్మద్ అన్వర్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

దేవరపల్లి: పదో తరగతి పరీక్షలు మండలంలో ఐదు కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వ హించిన బయలాజికల్ సైన్స్ పరీక్షకు 1,040 మంది విద్యార్థులకు 1,008 మంది హాజరయ్యారని ఎంఈఓలు ఎం.తిరుమలదాస్, కేఆర్‌ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. 32 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని తిరుమలదాస్ తెలిపారు. వీరిలో రెగ్యులర్ 21 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 11 మంది ఉన్నారని వివరించారు.

అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కరవు

నల్లజర్ల: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని మాలల ఐక్యవేదిక నాయకులు అన్నారు. నల్లజర్లలో శుక్రవారం మాలల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దూబచర్ల గాంధీకాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులదండ వేసి అవమానించిన ఘటనలో దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. అసలైన దోషులను పట్టుకోకుండా కేసును తప్పుదారి పట్టించడానికి ఈ సంఘటనకు సంబంధం లేని పుల్లలపాడుకు చెందిన బుడుపుల బాబ్జిపై నేరం ఆపాదించి అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. అసలైన దోషులను వదిలేసి మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఈ సంఘటనలో దోషిగా చూపడాన్ని తీవ్రంగా ఖండించారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులకు శిక్షణ

ఉండ్రాజవరం: డ్వాక్రా గ్రూపు సభ్యులకు వారి అవసరాల నిమిత్తం అవసరమైన సమయంలో రుణాలు పొందేలా ప్రణాళికలు రూపొందించాలని డ్వాక్రా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సంపత్ సూచించారు. ఉండ్రాజవరం మండల సమాఖ్య భవనంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు, డ్వాక్రా వీవోఏలు, ఎన్యూమరేటర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఎస్‌హెచ్‌జీ, వీవోల సమావేశం జియో ట్యాగింగ్ చేసిన స్థలంలో మాత్రమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు చెల్లంకి సౌభాగ్యలక్ష్మి, ఏపీఎం టి.బాలకోటయ్య, త్రిమూర్తులు, అద్దంకి సుబ్బారావు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వనితకు అభినందనలు



వనితను అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా నియమితులైన రాష్ట్ర మాజీ హోం మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గం సమన్వయకర్త తానేటి వనితను పలువురు నేతలు అభినందించారు. తాడేపల్లిగూడెంలోని నివాసంలో ఆమెను నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం కలిశారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. పార్టీ నల్లజర్ల మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బంకా అప్పారావు, ముప్పిడి వెంకటరత్నం, నియోజకవర్గ లీగల్ విభాగం అధ్యక్షుడు బోడిగడ్ల రాంబాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు చిన్ని నాగు, ప్రచార కమిటీ అధ్యక్షుడు కనికెళ్ల స్వర్ణరాజు తదితరులు వనితకు అభినందనలు తెలిపారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలిగా తనకు స్థానం కల్పించిన అధినేత జగన్‌కు వనిత కృతజ్ఞతలు తెలిపారు.

వారపు సంతకు వేలం

గోపాలపురం: గోపాలపురం మేజర్ పంచాయతీ పరిధిలోని వారపు సంత మార్కెట్, పంచాయతీ భవనాలకు శుక్రవారం వేలం నిర్వహించినట్లు ఈవోపీఆర్డీ కె.శ్రీనివాస్ తెలిపారు. వారపు సంత మార్కెట్ సంవత్సర కాలానికి రూ.2.70 లక్షలకు గోపాలపురానికి చెందిన శ్యామల కృష్ణారెడ్డి వేలంలో దక్కించుకున్నారు. పంచాయతీ భవనాలకు గతంలో రూ.2,800 ఉన్న అద్దెలు రూ.3,200 పెంచినట్లు ఈఓపీఆర్డీ తెలిపారు. ఉప సర్పంచ్ వింత అమరప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వి.అనురాధ, వార్డు సభ్యులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

తాళ్లపూడి: పేదలకు వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసాయం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైన 8 మందికి రూ.2,52,666 చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. వేగేశ్వరపురాని చెందిన గుణ్ణం నాగమణికి రూ.45,655, అడ్డాల సుప్రియకు రూ.25,000, జంగా సూర్యనారాయణకు రూ.37,100, ప్రక్కిలంకకు చెందిన ఎం.రవళికి రూ.25 వేలు, బల్లిపాడులో పాతాళ బాలఅభిషేక్‌కు రూ.31,500, పెద్దేవంలో జవ్వాది భూషణంకు రూ.20,524, టిరుగుడుమెట్టలో సాలి శివనారాయణకు రూ.30,787, మల్లంపల్లి ప్రకాశంకు రూ.37,100 ఆయా గ్రామాల్లో ఎన్డీయే కూటమి నాయకులతో కలసి అందజేసారు. వేగేశ్వరపురంలో యనాది కాలనీ, కొత్తపేట చర్చి వీధుల్లోని సమస్యలను పరిష్కరించాలని మహిళలు కోరారు. దీంతో ఎమ్మెల్యే ముప్పిడి పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

అంకిత భావంతో సేవలందిస్తే తగిన గుర్తింపు



అజయ్‌బాబు దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నల్లజర్ల: అంకితభావంతో అందించే సేవలే గుర్తింపు తీసుకువస్తాయని ఎంపీడీఓ సింహాద్రి అన్నారు. గ్రామీణ నీటి సరఫరా విభాగంలో 42 ఏళ్ల వివిధ హోదాలలో సేవలందించి, కొవ్వూరు సబ్ డివిజన్‌లో డీఈ హోదాలో ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న కె.అజయ్‌బాబును శుక్రవారం ఘనంగా సన్మానించారు. నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ సింహాద్రి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి జరిగే సాధారణ ప్రక్రియ అన్నారు. అజయ్‌బాబు విధి నిర్వహణలో చక్కని సేవలు అందించి, ప్రజలు, ప్రజాప్రతినిధుల అభిమానాన్ని పొందారన్నారు. ఎంపీపీ బంక జయలక్ష్మి మాట్లాడుతూ అజయ్ బాబు సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గ్రామీణ నీటి సరఫరా విభాగంలో సుదీర్ఘ కాలం సేవలు అందించి, ఆరోగ్యకర వాతావరణంలో పదవీ విరమణ పొందడం అదృష్టంగా భావించాలన్నారు. నబీపేట సర్పంచ్ గోతం సత్యలక్ష్మి, వామిశెట్టి పరమేశ్వరరావు తదితరులు మాట్లాడారు. అనంతరం అజయ్ బాబు దంపతులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు,అధికారులు ఘనంగా సత్కరించారు.

ప్రజలపై విద్యుత్ భారాన్ని ఉపసంహరించాలి



నిడదవోలు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు : సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రజలపై విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేసిందన్నారు. ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు పేరున రూ.32 వేల కోట్ల ఆర్థిక భారం ప్రజలపై వేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలు కాలంలో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని రాంబాబు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చార్జీల భారాలు వేసేది లేదని, స్మార్ట్ మీటర్లు జోలికి వెళ్లమని నాయకులు ఎన్నికల సందర్భంగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన వాటిని విస్మరించారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గంటి కృష్ణ, జి.డేనియల్ యర్రా శ్రీను, ఉస్మాన్, రాఘవ, సత్యనారాయణ, వస్కా ప్రభాకర్, సురేష్ యు.మోషే పాల్గొన్నారు.

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



బ్రాహ్మణగూడెంలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

చాగల్లు: 2024–25 సంవత్సరానికి స్వయం ఉపాధి పథకాల రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 2వ నుంచి ఇంటర్వ్యూలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్ శ్రీదేవి తెలిపారు. 2న ఉదయం 10 గంటలకు బ్రాహ్మణగూడెం, చిక్కాల, చంద్రవరం, మల్లవరం, గౌరిపల్లి, దారవరం గ్రామాలకు సంబంధించి 317 మందికి, 3న నందిగంపాడు, ఉనగట్ల, ఎస్ ముప్పవరం, మార్కొండపాడుకు సంబంధించి 332 మంది అభ్యర్థులకు, 4న ఉదయం 10 గంటలకు చాగల్లు, నెలటూరుకు చెందిన 333 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డులతో హాజరు కావాలని తెలిపారు. రుణాల కోసం మండలంలో మొత్తం 982 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీవో తెలిపారు. శుక్రవారం గ్రామ పంచాయతీల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు.


రేషన్ బియ్యం వేలం

గోపాలపురం: వివిధ 6ఏ కేసుల్లో పట్టుబడిన రేషన్ బియ్యానికి శుక్రవారం స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద వేలం నిర్వహించినట్లు జిల్లా సివిల్ సప్లై అధికారి ఎం.నాగాంజనేయులు తెలిపారు. గతంలో రెండు సార్లు వేలం నిర్వహించగా వ్యాపారులు రాకపోడంతో నిలుపుదల చేశామన్నారు. ఇప్పుడు 47 మెట్రిక్ టన్నుల బియ్యానికి వేలం నిర్వహించగా నల్లజర్లకు చెందిన వినాయక ట్రేడర్ కంపెనీ కిలో రూ 25.25కు వేలంలో దక్కించుకుందన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కొవ్వూరు: బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వర్రే నాగ మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ముంగమూరి నాగమణి, జనరల్ సెక్రటరీగా రాజాన వీరవెంకటసత్యనారాయణ (శ్రీను), జాయింట్ సెక్రటరీగా పీతల ఆనంద గెరటబాబు, కోశాధికారిగా టి.రవీంద్ర, స్పోర్ట్స్ సెక్రటరీగా జె.భరత్‌చంద్ర ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ఏలూరి గోపాలకృష్ణ, తాడేపల్లి ప్రభాకర్, ఎండీవీ ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. మొత్తం అసోసియేషన్‌లో 227 ఓట్లకు 208 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మురళీకృష్ణను, ఇతర కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు పూలమాలలతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

గంగాలమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవాలు ప్రారంభం



గంగాలమ్మ తల్లి

దేవరపల్లి: దేవరపల్లి–గోపాలపురం రోడ్డులోని పచ్చని పంట పొలాల మధ్య కొలువైన గంగా లమ్మ తల్లి ఆలయం వద్ద ఉగాది ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. 400 ఏళ్ల క్రితం స్వయంభుగా వెలసి గ్రామాన్ని కాపాడుతున్న మహిమాన్వితురాలిగా గంగాలమ్మ తల్లి భక్తుల పూజలందుకుంటోంది. పురాతన ఆలయం కావడంతో జీర్ణావస్థకు చేరుకోవడంతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. దాతల సహకారంతో 101 దేవతల ఆలయ నిర్మాణం వేగవంతంగా కొనసాగుతోంది. దేవరపల్లి–గోపాలపురం జాతీయరహదారిలో డైమండ్ జంక్షన్ వద్ద ఆలయ నిర్మాణం చేపట్టారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



యాదవోలులో ముస్లిం మత గురువులను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

దేవరపల్లి: యాదవోలులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నాయకులకు ముస్లిం సోదరులకు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పంచాయతీ ఉపసర్పంచ్ ఆరేటి సూర్యనారాయణ నాయకత్వంలో పార్టీ శ్రేణులు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మత గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ ముతవల్లి ఎండీ బాదుషా, చిన్నముతో వల్లి దౌలా, సెక్రటరీ ఎస్‌కే వల్లీబాబు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌కే ముస్తఫా, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్‌కే నాగశ్రీను, మాజీ ఉపసర్పంచ్ అనిశెట్టి సూర్యచంద్రం, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


స్వామివారికి వైభవంగా లక్షపత్రి పూజ



సోమేశ్వరస్వామి

నిడదవోలు : పట్టణంలో వేంచేసియున్న బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పంచాహిక దివ్య కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా మాసశివరాత్రి సందర్భంగా శుక్రవారం స్వామివారిని దర్శించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి గణపతి పూజ, అభిషేకాలు, లక్షపత్రి పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు, లలిత సహస్రనామాలు నిర్వహించారు. ఆలయం వద్ద నిడదవోలు భ్రామరి కూచిపూడి నాట్యం నిలయం శిక్షకురాలు దాసం పావని ఆధ్వర్యంలో ప్రదర్శించిన చిన్నారుల కూచిపూడి ప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం భక్తులు స్వామివారి దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో సోమాల శివ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహశాస్త్రి, అర్చకుడు అభిరామ్ శర్మ పాల్గొన్నారు.

వరి మాసూళ్లు ప్రారంభం



ప్రకాశరావుపాలెంలో వరి కోతలు

నల్లజర్ల: మండలంలో రబీ వరి మాసూళ్లు ప్రారంభమయ్యాయి. ప్రకాశరావుపాలెంలో శుక్రవారం వరి కోత యంత్రాల ద్వారా కోతలు ప్రారంభించినట్టు వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. ఈ ఏడాది 2065 హెక్టార్లలో వరి సాగు చేసినట్టు తెలిపారు. ఈ విస్తీర్ణంలో 20,395 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఎకరానికి 53 బస్తాల దిగుబడి వచ్చినట్టు చెప్పారు. త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. ధాన్యంలో తగినంత తేమ ఉండగానే కోతలు ప్రారంభించాలని రైతులకు సూచించారు.

పాస్టర్ ప్రవీణ్ మరణంపై సమగ్ర విచారణ చేపట్టాలి



కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

నిడదవోలు : రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం పలు అనుమానాలకు తావిస్తోందని దీనిపై సమగ్ర విచారణ చేయించాలని రెవరెండ్ పాస్టర్ మోర్త సమర్పణ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని సమిశ్రగూడెం సెయింట్ థామస్ లూథరన్ చర్చి వద్ద శుక్రవారం రాత్రి పాస్టర్ ప్రవీణ్ మరణంపై క్రైస్తవులు సంతాపం వ్యక్తం చేశారు. సంఘస్తులు, యువజనులు నిరసన వ్యక్తం చేస్తూ పాస్టర్ ప్రవీణ్ మరణంపై పూర్తిస్థాయి విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించిన సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అనుమానాలను నివృత్తి చేయండి

కొవ్వూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై క్రైస్తవుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు కొవ్వూరు నుంచి అనంతపల్లి సమీపంలోని టోల్‌గేట్ వరకు ఉన్న సీసీ పుటేజీలను, పోస్టు మార్టం రిపోర్టును బహిర్గతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతి నిధి, ఎస్సీ సీర్టింగ్ కమిటీ సభ్యుడు రాజేష్ సరిపెల్ల (మహాసేన రాజేష్) డిమాండ్ చేశారు. ఈ కేసుల విచారణాధికారిగా వ్యవహరిస్తున్న కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్‌ను శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఏపీ మహాసేన ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల అధ్యక్షులు వి.పృధ్వీ రాజ్, వై.రవీంద్ర పాల్గొన్నారు.